సంపాదకీయం

# మనమేం చేద్దాం?

మళ్లీ ఎన్నికలొస్తున్నాయి.

ఎన్నికలొస్తున్నాయంటే ఒక సంబరం వస్తున్నదని ఎదురుచూసే వారు రాష్ట్రంలో లేక పోలేదు గానీ ఏమవుతుందోనని భయంతో ఎదురుచూసేవారు కూడా ఉన్నారు.

ఈసారి ఎన్నికలలో 'నక్సలిజం' ప్రధాన సమస్య అని చంద్రబాబు నాయుడు ప్రకటించ డంతో భయపడేవారి సంఖ్య, భయపడడానికి గల కారణాలు పెరిగాయి. ఏడో ఎనిమిదో బెటాలియన్ల ప్యారామిలిటరీ బలగాలు కేంద్రం నుంచి దిగబోతున్నాయన్న వార్త చదివి 1994ను జ్ఞాపకం చేసుకొని ఒళ్లు చల్లబడ్డవాళ్లు చాలామందే ఉంటారు.

తెలుగుదేశానికి సీట్లు ఎన్ని వస్తాయన్న ప్రశ్న పక్కన పెట్టండి. 'నక్సలిజం' ప్రధాన సమస్య అంటూ ఎన్నికలకు దిగడం సమంజసమని వీధిలో ఒక్కరిచేతనయినా చంద్రబాబు చెప్పించగలడా? కరువు, రైతుల ఆత్మహత్యలు, 'విషజ్వరాల'తో పిల్లల చావులు, నిరుద్యోగం, తెలంగాణ – సహేతుకమైన అంశాన్ని చేపట్టి ఎన్నికలకు దిగదలచుకుంటే ఎన్ని లేవు? వీటిలో దేన్నయినా ఎంచుకొని 'నేనది చేశాను, నా అవగాహన ఇది, నేనింకా ఇది చేయ బోతాను, నాకు వోటు వేయండి' అని ప్రజల ముందుకొచ్చినట్టయితే వోటు వేసినా వేయకున్నా ప్రజాస్వామ్యాన్ని గౌరవించాడని ప్రజలతనిని గౌరవించవచ్చు. చెప్పుకోవడానికీ అడగడానికీ ఏమీలేని దివాళాకోరుతనం కాకపోతే 'నక్సలిజాన్ని' ప్రధాన సమస్య చేస్తాడా?

పైగా తానే కృత్రిమంగా ఈ విషయాన్ని ప్రధానం చేసి దానిని సమర్థించుకోవడానికి పెద్దయెత్తున కేంద్ర ప్యారామిలిటరీ బలగాలను తీసుకొచ్చి ప్రజల ప్రాణాల మీదికి తెస్తాడా?

ఈ దొల్లతనాన్ని, ఈ దుర్మార్గాన్ని ఎన్నికలలో ప్రధాన అంశం చేయడం అవసరం. ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారు అనేది కాదు. ఆ ప్రక్రియ ప్రజల అవసరాలనూ అభిప్రాయాలనూ గౌరవించేదిగా సాగాలి. లేకపోతే ఎన్నికలు జరుపుకోవడం అనవసరం, ప్రజల ఆమోదం పొందాడు అని ఒకడికి ముద్రవేసి అయిదేళ్లు రాష్ట్రం మీద వదలడం అనవసరం.

కరువు, ఆత్మహత్యలు, పిల్లల మరణాలేకాక తెలుగుదేశం పాలనలో మితిమీరిన పోలీసు హింస కూడా ఒక ఎన్నికల అంశం కాగలదు. పోలీసు యంత్రాంగం చట్టబాహ్యమైన పని తీరు రాశిలోనూ గుణంలోనూ కూడా గడచిన అయిదారేళ్లలో అపూర్వంగా దిగజారింది. పోలీసుల చేతికి చిక్కిన మనిషిని కోర్టులో హాజరుపెట్టే దాకా ప్రాణానికి గండం ఉంటుందిగానీ ఆ తరువాత భయం లేదన్న అభిప్రాయం చాలాకాలం ఉండింది. ఆ భరోసా లేకుండ చేసిన ఘనత తెలుగుదేశం పాలనకు దక్కుతుంది. రిమాండులో ఉన్న ఖైదీని కోర్టుకు తీసుకుపోతూ దారిలో కాల్చి చంపిన ఘటనలు, కోర్టు నుంచి జైలుకు తీసుకొస్తూ దారిలో చంపిన ఘటనలు, ఇంటరాగేషన్ కోసమని పోలీసు కస్టడీకి తీసుకొని లాకప్పులో కాల్చి చంపిన ఘటనలు గడచిన అయిదారేళ్లలో రాష్ట్రంలో అనేకం జరిగాయి.

పోలీసుల కనుసన్నలలో నడుచుకునే ప్రైవేటు హంతక ముఠాలను తయారుచేసిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదే. ఎన్‌కౌంటర్లు, చిత్రహింసలు, అక్రమ నిర్బంధాలు చట్టాన్నీ, రాజ్యాంగ ప్రాథమిక హక్కులనూ కాలరాసే చర్యలు కాగా, ఉద్యమాలలో పనిచేస్తున్న వారి బలహీనతలను వాడుకొని వారిని నేరస్తులుగా మార్చి వారిచేతనే వారి సహచరులను చంపించి బయటికొచ్చిన తరువాత సాయుధ ముఠాలుగా తయారయి పోలీసులకు అండగా ఉంటూ నేరాలు చేసుకుంటూ బతకమని ప్రోత్సహించడం చట్టబాహ్యమే కాక అదనంగా అనాగరికం, అనైతికం కూడా.

ఇటువంటి ముఠాలు ఇప్పుడు రాష్ట్ర రాజధానిలోనూ వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలోనూ ఉన్నాయి. ఇది బహిరంగ రహస్యమే. ఇంకా ఏ అనుమాన మయినా మిగిలి ఉంటే నవంబర్ నెలలో జరిగిన సిరాజ్ – లక్ష్మణ్‌ల ఉదంతం దానిని పటాపంచలు చేసి ఉండాలి. అయితే దుర్మార్గమైన ఈ ఎత్తుగడను అనుసరిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం బోనెక్కవలసింది పోయి పౌరహక్కుల సంఘాన్ని బోనెక్కించి తాను తప్పుకోగలిగింది. ఇది దురదృష్టకరం.

ఎన్నికల సందర్భంగానయినా ఇవన్నీ చర్చకు రావడం అవసరం. ఎన్నికయి అధికారం చేపట్టిన తరువాత పాలకులను నిలదీసే సమర్థమైన మార్గాలేవీ మన ప్రజాస్వామ్యంలో లేవు. కనీసం ఎన్నికలప్పుడయినా నిలదీయాలి. ప్రస్తుత పాలకులనే కాదు, రేపు పాలకులు కాగోరేవారిని కూడా నిలదీయాలి. వారి చరిత్ర మనకు తెలియనిది కాదు – వారి మీద భ్రమలుండే అవకాశమూ లేదు. ప్రజల హక్కులకూ ప్రజాస్వామ్యానికీ సంబంధించిన ఒక్కొక్క

అంశం మీదా వారినీ వీరినీ నిలబెట్టి జవాబు చెప్పించాలి.

ఇప్పుడు ఏ హామీలిచ్చినా రేపు అధికారానికి వచ్చినాక నిలబెట్టుకోకపోతే మనం చేయగలిగినదేమీ లేనప్పుడు ఈ శ్రమ ఎందుకని అడగవచ్చు. వెంటనే ప్రయోజనమేమీ రాకపోవచ్చును గానీ దీనిని ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచుకునే ప్రయత్నంగా అర్థం చేసుకుంటే వృద్ధా శ్రమ అనుకోము. మనకున్నది అసమగ్రమైన ప్రజాస్వామ్య వ్యవస్థ. దానిని మరింత దిగజార్చడానికి అన్ని పార్టీలూ కలిసి నిరంతర కృషి చేస్తున్నాయి. ఇది సమగ్రమైన ప్రజాస్వామ్యం కాదు కాబట్టి దీనిని కాపాడే ప్రయత్నం అనవసరం అని మనం అనుకుంటే వారి ఎత్తుగడకే విజయం చేకూర్చిన వారిమవుతాము. ప్రజల ఆకాంక్షలకూ ఆలోచనలకూ పాలనా యంత్రాంగం జవాబుదారు కావాలన్నది ప్రజాస్వామ్యానికి ప్రాథమిక గీటురాయిగా భావించినట్టయితే ఆ దిశగా మన రాజకీయ వ్యవస్థనూ పాలనా వ్యవస్థనూ తీసుకుపోయే కృషి చేయడం అవసరం.

–మానవహక్కుల వేదిక

ఫిబ్రవరి, 2004